# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **డిజిటల్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో సూచించారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు.**

**3.** **రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధ్యానతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

**4.** **మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.**

**5.** **ఈ రోజు ప్రపంచ యానిమేషన్ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

డిజిటల్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. ప్రధానమంత్రి తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం 115వ సంచిక నిన్న ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి వివిధ అంశాలపై ప్రసంగించారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలను జాతీయ స్థాయిలో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. పండుగల కొనుగోళ్లలో స్థానిక ఉత్పత్తులకు ప్రాధ్యానతనిస్తూ, స్వావలంబన భారతదేశ ప్రచారాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. తెలంగాణకు చెందిన డి.వైకుంఠం “చేర్యాల్” జానపద కళను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేందుకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. డిజిటల్ అరెస్టుల వంటి ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ పొందేందుకు ‘క్షణమాగండి. ఆలోచించండి. ఆ తర్వాతే స్పందించండి’.. అనే అంశాలను పాటించాలని ప్రధానమంత్రి సూచిస్తూ,

వాయిస్ (30 సెకన్లు)

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గోదావరి నది మధ్యలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ రెస్టారెంట్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు పలు మార్పులు చేసినట్లు తెలిపారు. పర్యాటక రంగాన్ని పరిశ్రమగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రాధ్యానతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని ఆగర్రు, ఆగర్తి పాలెం గ్రామాలలో డ్రైనేజీ, కచ్చా రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకు , మంచినీటి పైప్ లైన్ పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఫింఛన్ నగదు పెంపు, డీఎస్సీ, అన్న క్యాంటీన్, ఇన్‌పుట్ సబ్సిడీగా హెక్టార్ కు 25 వేలు వంటివి అమలు చేశామని అన్నారు. ఆగర్తిపాలెం గ్రామంలో సురక్షిత మంచినీరు సరఫరా, సిమెంట్ రహదారులు వంటి అభివృద్ధి పనులను ప్రారంభించామని మంత్రి తెలియజేస్తూ...

..వాయిస్.. 25 సెకన్లు

---------------------------

తెలంగాణలో ఇక నుండి సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి సదర్ సమ్మేళన వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర చరిత్రలో సదర్ ఉత్సవాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. పశువులను పూజించడం యాదవుల ప్రత్యేకత అని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మంలో మహిళా శక్తి క్యాంటీన్, బస్సు షెల్టర్‌ను నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలకు 25 వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలను ఇచ్చి మహిళలను వ్యాపార వేత్తలుగా ప్రోత్సహిస్తామన్నారు, అలాగే ఆర్టీసీలో డ్వాక్రా సంఘాలను భాగస్వామ్యం చేయనున్నామని తెలిపారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ యానిమేషన్ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. స్థిరంగా ఉన్న చిత్రాలను సాంకేతిక ప్రక్రియతో కదిలించే విధంగా తీర్చిదిద్దడాన్నే యానిమేషన్ అంటారు. 1892 వ సంవత్సరం అక్టోబర్ 28వ తేదీన ప్యారిస్ నగరంలోని గ్రెవెన్ మ్యూజియంలో చార్లెస్ ఎమిలే రెనాడ్ అనే శాస్త్రవేత్త తన మొట్టమొదటి యానిమేషన్ చిత్రాన్ని ప్రదర్శించిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున అంతర్జాతీయ యానిమేషన్ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. యానిమేషన్ దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ...

వాయిస్ (24 సెకన్లు )

---------------------------

అన్నమయ్య జిల్లా రాయచోటిలో 68వ రాష్ట్రస్థాయి బాల, బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఆంధ్రప్రదేశ్ క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నిన్న ప్రారంభించారు. రేపటి వరకు జరగనున్న ఈ క్రీడా పోటీలపై మరింత సమాచారాన్ని మా ఆకాశవాణి అన్నమయ్య జిల్లా ప్రతినిధి ఎస్ సుదర్శన్ రెడ్డి అందజేస్తారు.

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

చేతివృత్తుల వారి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంకుబండ్‌లో 26 లక్షల వ్యయంతో నిర్మించనున్న దోబిఘాట్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేంద్ర మంత్రి నిన్న భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న క్రమంలో చేతివృత్తులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముద్ర యోజన, స్వనిధి, విశ్వకర్మ యోజన ద్వారా చేతివృత్తుల వారిని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. విశ్వకర్మ యోజన కింద కేంద్రప్రభుత్వం కోట్లాది మంది ప్రజలకు నైపుణ్య శిక్షణ, పరికరాలు, ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు.

---------------------------

తెలంగాణ నుంచి బదిలీ అయి ఆంధ్రప్రదేశ్ కు వచ్చిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్రంలో పోస్టింగ్‌లు ఇస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శిగా వాణీ ప్రసాద్‌ను నియమించారు. కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా వాకాటి కరుణ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ వీసీఎండీగా కె. ఆమ్రపాలిని నియమించారు. అలాగే టూరిజం అథారిటీ సీఈవోగా కె. ఆమ్రపాలికి పూర్తి అదనపు బాధ్యతలను ఇచ్చారు.

---------------------------

తిరుమలలో ఈనెల 31న దీపావళి ఆస్థానం దృష్ట్యా వీఐపీ విరామ దర్శనాలు రద్దు చేసినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం –టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. ప్రొటోకాల్ ప్రముఖులు మినహా.. సిఫార్సు లేఖలపై వీఐపీ విరామ దర్శనాలు రద్దు చేశామని, ఈనెల 30న సిఫారసు లేఖలు స్వీకరించబోమని అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని భక్తులకు టిటిడి విజ్ఞప్తి చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

=====================